సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 12 । మార్చి । 2024



అంతటా ఇన్‌చార్జీలే!

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ గాడితప్పుతోంది. ఎనిమిది డివిజన్లకు గాను కేవలం ఒక్కరే రెగ్యులర్ ఏటీడీవో ఉండడం గమనార్హం. 8లో▸



రంజాన్ వేళలు

మంగళవారం	ఇఫ్తార్: 6.26

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/24.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ధర్నాలో పాల్గొన్న ఆశలు, జీపీ కార్మికులు

కైలాస్‌నగర్: ఆశ కార్యకర్తలతో పాటు జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశలకు సంబంధించి లెప్రసీ సర్వే పారితోషకాలు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, జిల్లాకమిటీ సభ్యులు స్వామి,లక్ష్మి, స్వప్న, పుష్పలత, గంగమ్మ, గంగన్న పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు రహిత సమాజానికి ప్రతి ఒక్కరూకృషి చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్కూరి లక్ష్మినగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈనెల 11 నుంచి 24వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు ఉన్నట్లయితే కుష్ఠుగా అనుమానించి వారికి పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కుష్ఠు నివారణ అధికారి గజానంద్, వైద్యాధికారి దీపిక, డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, రమణాచారి, కోఆర్డినేటర్ విష్ణు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి సదస్సు'కు జిల్లా నుంచి 950 మంది

- నేడు 19 బస్సుల్లో పయనం

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్‌లో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో తెలంగాణ మహిళా శక్తి పేరిట భారీ సదస్సు నిర్వహించనుంది. నాంపల్లిలోని పరేడ్‌గ్రౌండ్‌లో సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న సదస్సుకు జిల్లా నుంచి 950 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులను తరలించనున్నారు. ఇందుకోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 19 ప్రత్యేకబస్సులను ఏర్పాటు చేశారు. ఒక్కో మండలం నుంచి 50 మందిని తరలించేలా ఒక్కో బస్సు కేటాయించారు. 17 మండలాలతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ నుంచి వంద మందిని తరలించనున్నారు. వీరి కోసం మరో రెండు బస్సులను కేటాయించారు. బస్సుకు ఇద్దరు చొప్పున ఏపీఎం, సీసీ, ఆర్‌పీలను లైజన్ అధికారులుగా నియమించారు. సభ్యులకు ఉదయం అల్పాహారం తోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించనున్నారు. ఇందుకోసం నలుగురు డీపీఎంలు, ముగ్గురు ఏపీఎంలను నియమించారు. సభ్యుల తరలింపు ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులు, ఉద్యోగులతో డీఆర్డీవో సాయన్న టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు.

మరో మూడు 'ప్రజాపాలన' సేవా కేంద్రాలు

కైలాస్‌నగర్: గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి అర్హులైన పట్టణవాసుల ప్రయోజనార్థం మున్సిపల్ పరిధిలో మరో మూడు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రెండు కౌంటర్ల ద్వారా సేవలందిస్తున్నారు. వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో సోమవారం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులై ఉండి లబ్ధి చేకూరని వారు భారీగా తరలిరావడంతో వారిని నియంత్రిండం సిబ్బందికి ఇబ్బందిగా మారింది. క్యూలో మహిళల తోపులాట చోటుచేసుకుంది. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారమందించారు. ఇద్దరు మహిళా హోంగార్డులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. కాగా పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పట్టణంలో మరో మూడు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. హమాలీవాడ, ఖుర్షీద్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు ఫిల్టర్‌బెడ్‌లోని ఈ సేవ కార్యాలయంలో ఇవి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పెరిగిన రద్దీ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలోని కేంద్రంలో మంగళవారం నుంచి మరో కౌంటర్ అందుబాటులోకి తెచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలు ఆందోళనకు గురికాకుండా సిబ్బందికి సహకరిస్తూ తమ వివరాలు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ సూచించారు.



ఢిల్లీలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ముఖ్య నేతలు

తాడోపేడో..

- నగేశ్ చేరికతో బీజేపీలో ముసలం
- ఢిల్లీ అగ్రనేతలతో పార్లమెంట్ పరిధిలోని నేతల భేటీ
- పార్టీలో పనిచేస్తున్న వారికే ప్రాధాన్యమివ్వాలని వినతి
- 'గొడం'కు టికెట్ నో అనే ప్రచారం
- మరి సిట్టింగ్‌కేనా.. ఇతరులకా..?
- అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న సస్పెన్స్

సాక్షి,ఆదిలాబాద్: మాజీ ఎంపీ గొడం నగేశ్ బీజేపీలో చేరికతో ఆ పార్టీలో ముసలం మొదలైంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలంతా కలిసి ఢిల్లీ వెళ్లి అగ్రనేతలతో సోమవారం భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న వారికే అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. ఇదిలా ఉంటే లంబాడాలను పరిగణలోకి తీసుకోవాలని ఆ సామాజికవర్గం నేతలు విన్నవించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి బీఎల్ సంతోష్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ను వారు కలిశారు. కాగా గొడంకు టికెట్ ఇవ్వమని అగ్రనేతలు చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిట్టింగ్ ఎంపీకా.. లేనిపక్షంలో ఇతర నేతలను ఆదిలాబాద్ స్థానానికి పరిగణలోకి తీసుకుంటారా అనేది ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

సంజాయిషీ ఇచ్చారనే ప్రచారం..

ఢిల్లీ వెళ్లిన లంబాడా నేతలు తమకు టికెట్ ఇవ్వాలని అడుగుతూనే మరోపక్క ఎమ్మెల్యేల మద్దతు ఉందని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో గొడం నగేశ్‌ను పార్టీలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన ఓ ఎమ్మెల్యే ఇక్కడ ఒంటరయ్యారన్న ప్రచారం సాగుతోంది. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు ఆ ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్నారా అనేది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఎంపీ టికెట్ నగేశ్‌కు ఇవ్వాలని నేను చెప్పలేదని ఒంటరైన ఆ ఎమ్మెల్యే జిల్లా నేతలకు సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని చెప్పుకుంటున్నారు. ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఎవరికి ఇవ్వాలన్నది అధిష్టాన నిర్ణయమేనని ఆ ఎమ్మెల్యే జిల్లా నేతలతో చెప్పుకొచ్చినట్లు ప్రచారం సాగుతుంది. ఏదేమైనా బీజేపీలో రెండు రోజులుగా సాగుతున్న పరిణామాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

ఢిల్లీలో సందడి..

మాజీ ఎంపీ గొడం నగేశ్ ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం కాషాయ కండువా కప్పుకున్న విషయం విదితమే. ఆయన పార్టీలో చేరిన మరుసటి రోజే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలంతా ఢిల్లీ బాట పట్టారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు, హరినాయక్ జట్టుగా హస్తినకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రభారి మయూర్ చంద్ర, మరో ఒకరిద్దరు నేతలు కలిసి మరో జట్టుగా దేశ రాజధానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ బీఎల్ సంతోష్, డాక్టర్ లక్ష్మణ్‌ను కలిశారు. కాగా ఇందులో ఒక బృందానికి అగ్రనేతలు గొడం నగేశ్‌కు టికెట్ ఇవ్వమని చెప్పినట్లు పార్టీలో ప్రచారం సాగుతుంది. అయితే ఇందులో ఎవరికీ టికెట్ ఇస్తామనే విషయంలో అగ్రనేతలు ఎలాంటి హామీ ఇవ్వనట్లు తెలుస్తోంది. లంబాడాల ఓట్లు లక్షన్నర వరకు ఉన్న దృష్ట్యా టికెట్ ఇస్తే గెలుస్తామని రాథోడ్ రమేశ్, రాథోడ్ బాపూరావు, రాథోడ్ జనార్దన్ నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల మద్దతు కూడా తమకు ఉందని చెప్పినట్లు సమాచారం. పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని, సీటు ఇవ్వొద్దని నేతలంతా ముక్తకంఠంతో కోరినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పార్టీ నాయకత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నట్లు ఆ తర్వాత నేతలు ఢిల్లీలో మీడియా సమావేశంలో చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే ఢిల్లీలో ఉన్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జిల్లా నేతలతో కలిసి ఉండటం గమనార్హం. కాగా ఎంపీ సోయం బాపూరావు ఎక్కడ ఉన్నారన్నది తెలియరాలేదు. నగేశ్ చేరిక తర్వాత ఆయన సైలెంట్‌గా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

అన్నదాతకు అండగా..



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు (ఫైల్)

- అందుబాటులోకి టెక్నాలజీ
- 'రైతు నేస్తం'తో చేరువ
- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలు
- జిల్లాలో నాలుగు కేంద్రాల్లో అమలు

ఆదిలాబాద్‌టౌన్: అన్నదాతల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని టెక్నాలజీ ద్వారా వాటికి పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తుంది. ఇందులో భాగంగా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వారానికి రెండు సార్లు శాస్త్రవేత్తల ద్వారా రైతుల సమస్యలను వారి ముగింటికి తీసుకొచ్చి పరిష్కార మార్గం చూపేలా ముందుకు సాగుతోంది. తొలివిడతగా జిల్లాలోని నాలుగు రైతు వేదికల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల కార్యక్రమాన్ని ప్రారంభించారు. విడతల వారీగా జిల్లాలో మిగిలిన చోట్ల ఈ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు.

జిల్లాలో సాగు పరిస్థితి ..

జిల్లాలో సాధారణ సాగువిస్తీర్ణం 5లక్షల 72వేల ఎకరాలుగా ఉంది. అలాగే యాసంగిలో లక్ష50వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే చాలా మంది రైతులు సాగులో అవగాహన లేక వారికి నచ్చిన విధంగా ఎరువులు వేయడం, విచ్చలవిడిగా పురుగుల మందు పిచికారీతో ఆశించిన దిగుబడి రాక నష్టపోతున్నారు. పంటకు ఏయే చీడపడలు ఆశిస్తున్నాయో తెలియడం లేదు. అలాగే తమ చేలు ఏ పంటలకు అనుకూలం.. వేటిని సాగు చేయాలో చాలా మందికి అవగాహన లేక ఆశించిన దిగుబడి పొందలేకపోతున్నారు. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

వీడియో కాన్ఫరెన్స్ సేవలు..

జిల్లాలో 101 రైతు వేదికలున్నాయి. అయితే ప్రస్తుతం జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా రియల్‌టైమ్ సొల్యూషన్ త్రూ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రాజెక్ట్ కింద మొదటి విడత వీటిని అమలు చేస్తుంది. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీస్ వీటికి పరికరాలను సమకూర్చింది. బీఎస్ఎన్ఎల్ కనెక్టివిటీ కేబుల్ నెట్వర్క్, టీఫైబర్ పరికరాలను సమకూర్చాయి. వీడియో కాన్ఫరెన్స్ కోసం ఆయా వేదికల్లో టీవీలు, కెమెరాలను ఏర్పాటు చేశారు.

వారానికి రెండుసార్లు..

రైతు వేదికల ద్వారా ఆయా క్లస్టర్ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారానికి రెండు సార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేయవచ్చు. శాస్త్రవేత్తలు ఇచ్చే లింక్ ద్వారా నేరుగా పంట పొలాల్లో పండిస్తున్న పంటలను చూపించి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లవచ్చు. సోమ, శుక్రవారాల్లో శాస్త్రవేత్తలు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తెస్తారు.అలాగే యూట్యూబ్ లైవ్, జూమ్‌లింక్ ద్వారా నేరుగా మాట్లాడే ఆస్కారం ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే అధికారులకు శిక్షణ కల్పించారు. రైతులతో పాటు వ్యవసాయ అధికారులతో కూడా సమావేశాలు నిర్వహించారు. రెండుమూడేళ్ల క్రితం రైతు వేదికలు నిర్మించినప్పటికీ అవి నిరుపయోగంగా మారాయనే చెప్పవచ్చు. రైతు నేస్తం కార్యక్రమంతో ప్రస్తుతం వాటిని అందుబాటులోకి తీసుకొచ్చి అన్నదాతలకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

రైతులకు ప్రయోజనం..



రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అన్నదాతలకు మేలు జరగనుంది. సాగులో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు రైతు వేదికల్లో తొలివిడతగా వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతుల సమస్యలను శాస్త్రవేత్తలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను చూపుతారు. త్వరలో మిగతా వేదికల్లోనూ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

ఓపిగ్గా విని.. భరోసా కల్పించి



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

- తొలి ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా మార్క్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులకు ఆదేశం

కైలాస్‌నగర్: ప్రజావాణి కార్యక్రమంపై కొత్త కలెక్టర్ రాజర్షి షా తన మార్క్ చాటుకున్నారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విని వారికి భరోసా కల్పించేలా వ్యవహరించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపిగ్గా విన్నారు. అందుబాటులో ఉన్న అధికారులకు అర్జీలు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. మండల, డివిజన్‌స్థాయి సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ కారణాలపై ఆరా తీశారు. త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో రెవెన్యూ, పోలీస్‌శాఖలకు సంబంధించిన అంశాలపై అర్జీలు అందితే బాధితులను కోర్టుకు వెళ్లమని సూచించేవారు. ఈయన మాత్రం వాటిపై సమగ్రంగా ఆరాతీశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితులకు భరోసా కల్పించారు. అనంతరం పెండింగ్ అర్జీలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో మార్పులు చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులు అధికారులను కలిశాక కౌంటర్లకు వెళ్లి ఆన్‌లైన్ చేసుకునేవారు. ఇక నుంచి కౌంటర్లలో ఆన్‌లైన్ రశీదు తీసుకున్నాకే అధికారులను కలిసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈవారం వివిధ సమస్యలపై 22అర్జీలు అందాయి. మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చిన వారి నుంచి కూడా అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

కైలాస్‌నగర్: ఎండల తీవ్రత పెరిగినందున జిల్లాలో తాగునీటిఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరాపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. చేతిపంపులు, పంపుసెట్లకు మరమ్మతులు చేపట్టి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను అరికట్టడంతో పాటు తక్షణమే మరమ్మతు చేసి నీటి వృథా జరగకుండా చూడాలన్నారు. అవసరమైన చోట కొత్త పైపులు వేయడంతో పాటు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించి నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. మిషన్ . భగీరథ నీరు అందని గ్రామాలు, కాలనీలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతు పనులన్నీ ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి జీపీ నిధులు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రత్నమాల, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం

- మంగళవారం తొలి ఉపవాసం
- దర్శనమిచ్చిన నెలవంక
- నెల రోజులపాటు ఉపవాసాలు



నమాజ్‌లో ముస్లింలు (ఫైల్)

నెన్నెల/ఉట్నూర్‌రూరల్: ఆకాశంలో సోమవారం రాత్రి నెలవంక దర్శనంతో రంజాన్ మాసం మొదలైంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా, కఠోర నియమాలతో ఆహార పానీయాలు ముట్టుకోకుండా నెల రోజులపాటు ఆచరించే రంజాన్ ఉపవాసాలు జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచి మొదటి ఉపవాస దీక్షకు ముస్లింలు సిద్ధమయ్యారు. సోమవారం రాత్రి నుంచే మసీదుల్లో ఖురాన్ పఠనం, తరావీ నమాజ్‌లు ప్రారంభమయ్యాయి. పవిత్ర మాసంలో నమాజ్‌ల కోసం మసీదులను జిల్లాలో ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష(సహార్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం(ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలు అందించడానికి హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30 రోజులపాటు ఉపవాసాలు ఆచరించి మళ్లీ సాయంత్రం ఆకాశంలో నెల వంకను చూసి మరుసటి రోజు ఉదయాన్నే రంజాన్ పండుగను జరుపుకుంటారు.

అతి పవిత్ర మాసం

ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. దివ్య ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాసాల ద్వారా శరీరాన్ని శుష్కింపజేయడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుందని నమ్ముతారు.

ప్రత్యేక నమాజ్‌లు

ప్రతీ రోజు రాత్రి 8.30గంటల నుంచి 10గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్‌లు చేస్తారు. దివ్య ఖురాన్‌ను రోజుకు 20రకాతుల చొప్పున తరావీ నమాజ్‌లో 27 రోజులపాటు హాఫిజ్‌లు పాటిస్తారు. రంజాన్‌లో రాత్రి పూట ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25రోజుల తరావీ నమాజ్ తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈద్ ఉల్ ఫితర్ వరకు ఉపవాస దీక్ష ఆచరిస్తారు. ఇహ లోకంలో ఆచరించే ఈ కఠోర దీక్షలు పరలోకంలో రక్షణగా ఉండి కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

పవిత్ర మాసం



ఈ మాసంలో నాలుగు ప్రత్యేకతలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియమ నిష్టతో ఉపవాసం ఉండడం, ఖురాన్ చదవడం, సంవత్సరంలో సంపాదించిన ఆదాయంలో ఫిత్ర, జకాత్ బీద వారికి అందించడం, బీదవారికి రంజాన్ మాసంలో సహాయం అందించడం వంటి కార్యక్రమాలు అధికంగా చేస్తుంటారు.

– హాఫీజ్ మహ్మద్ మోయినొద్దీన్, ఉట్నూర్

నియమ నిష్టలతో ప్రార్థనలు

రంజాన్ మాసం చాలా దైవంతో కూడిన మాసం. ఇందులో నియమ నిష్టలతో ప్రార్థనలు, అన్ని విధాలుగా నెలపాటు కఠోర దీక్షలు చేపడితే దేవుడు తన దగ్గరి వాడిగా చేసుకుంటాడు. రంజాన్ నెలలో పని మనిషి కష్టాలను యజమాని దూరం చేసినట్లయితే దేవుడు ఆయన తప్పులను క్షమించేస్తాడు. ప్రతీయేడు ఈ పండుగను ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి చేసుకోవడం ఆచారంగా వస్తోంది.

– రిజ్వాన్ మౌలానా, సఫాబైతుల్ మాల్ మండల అధ్యక్షుడు, ఉట్నూర్

పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న రంజాన్ ఉపవాస దీక్షలను శాంతియుతంగా జరుపుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మతపెద్దలతో సోమవార సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా అన్ని మసీదుల వద్ద శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు.తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ,మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్, శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా చూడాలని, అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రమేశ్‌రాథోడ్, ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ప్రథమ సంవత్సరం ఫిజికల్ సైన్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు మొత్తం 9,233 మందికి గాను 8,656 మంది హాజరయ్యారు. 577 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 1,112 మందికి గాను 994 మంది హాజరయ్యారు. 118 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీంద్ర కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

బీజేపీకి రాజీనామా

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన అక్కెపెల్లి లక్ష్మణ్ తన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడి పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం ఇచ్చోడలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకు అధిష్టానం టికెట్ ఇవ్వకపోవడాన్ని నిరసనగా పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఏజెన్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఉద్యోగ ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో జిల్లాకు చెందిన ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ రాథోడ్ పాల్గొన్నారు. సీఆర్టీ, సీఆర్పీ, కేజీబీవీ, గురుకుల టీచర్లు, డీఏ, పీఆర్సీ, ఎండీఎం వర్కర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని 5వ షెడ్యూల్ ప్రకారం పదోన్నతులు, నియామకాలు ఏజెన్సీ అభ్యర్థులకే కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: డీఎస్సీలో భాగంగా ఎస్జీటీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీసర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22 వరకు www. tsbcstudycircle. cgg. gov. in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. రిజర్వేషన్, ఇంటర్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. 26 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 08732-221280, 99496 84959 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇద్దరు దొంగల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: రాగి తీగల చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గతనెల 16న పట్టణంలోని బిరాములు కాంప్లెక్స్‌లో గల షాపులో రాగితీగల చోరీ జరిగింది. మహారాష్ట్రలోని వరోర గ్రామానికి చెందిన దశరత్ నారాయణ, అర్జున్ బాపురావ్ సిందేలు దొంగతనానికి పాల్పడ్డారు. మహేంద్ర స్కార్పియోలో తీగలు ఎత్తుకెళ్లారు. ఆదిలాబాద్‌లో వాటిని విక్రయించేందుకు ప్రయత్నించగా ఆదివారం పోలీసుల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ వివరించారు.

కిరాణ షాప్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల ఓ కిరాణ షాప్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. యజమాని ప్రకాశ్‌సింగ్ షెకావత్ రోజులాగే రాత్రి షాపు మూసివేసి ఇంటికెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి షెటర్ పగలగొట్టి ఉంది. కౌంటర్‌లో రూ.2వేల నగదుతోపాటు రూ.2600 విలువ గల ఆయిల్ ప్యాకెట్లు దొంగతనానికి గురయ్యాయి. బాధితుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

అంతటా ఇన్‌చార్జీలే..

- 8 డివిజన్లలో ఒక్కచోటనే రెగ్యులర్ ఏటీడీవో
- ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ కరువు



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది డివిజన్లు ఉండగా వీటి పరిధిలోని ఐటీడీఏలో 133 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 77 బాలుర ఆశ్రమ పాఠశాలల్లో 20 వేల మంది విద్యార్థులు, 56 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాలల పర్యవేక్షణ కోసం ప్రతీ డివిజన్‌కు ఒకరు ఏటీడీవోలు ఉండాలి. కానీ గత మూడేళ్ల నుంచి రెగ్యులర్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

ఎనిమిదిలో ఒక్కరే రెగ్యులర్..

ఏటీడీవోలు తమ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రధానంగా విద్యార్థుల విద్యాబోధన, మెనూ, ఆరోగ్యంతోపాటు ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా పాఠశాలకు వస్తున్నారా.. సమయపాలన పాటిస్తున్నారా లేదా వంటివి పర్యవేక్షించాలి. ఇదిలా ఉండగా, ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, బోథ్, ఉట్నూర్ డివిజన్లు ఉండగా అన్నిచోట్ల ఇన్‌చార్జి ఏటీడీవోలే ఉన్నారు. ఒక్క ఆసిఫాబాద్ డివిజన్‌కు మాత్రమే రెగ్యులర్ ఏటీడీవోగా ఉన్నారు. జైనూర్, కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి డివిజన్లలో ఆయా పరిధిలోని హెచ్‌డబ్ల్యూవోలే ఇన్‌చార్జి ఏటీడీవోలుగా కొనసాగుతున్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులను పర్యవేక్షించాల్సిన హెచ్‌డబ్ల్యూవోలకు ఏటీడీవోలుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

విద్యపై ప్రభావం

ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రతిఏడాది వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యాబోధన చేస్తోంది. బోధన కొనసాగుతున్న విధానాన్ని ఏటీడీవోలు వసతిగృహాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కొన్నిచోట్ల పర్యవేక్షణ లేకపోవడంతో పది ఫలితాలపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదని గిరిజన సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

తూతూమంత్రంగానే తనిఖీ

ఏటీడీవోలు వసతిగృహాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కొందరు చుట్టం చూపులా తనిఖీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అయినా ఉన్నతాధికారులు మాత్రం అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

పోస్టులు భర్తీ చేయలేక..

గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఏటీడీవో శాఖలకు రెగ్యులర్ ఏటీడీవోలు లేకపోవడంతో గిరిజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇన్‌చార్జి ఏటీడీవోలకు అంతంత మాత్రమే అనుభవం కలిగి ఉండడంతో వసతి గృహాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఏటీడీవో పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో గిరి విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతుందని పలు గిరిజన సంఘాల నాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా వెంటనే పోస్టులు భర్తీ చేసి గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తాం



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ పర్థాన్ నేతలు

- ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా

ఉట్నూర్‌రూరల్: జిల్లాలో ఆదివాసీల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా అన్నారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో జిల్లాలోని ఆదివాసీ తొమ్మిది తెగలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు సెలవులకు వెళ్లి తిరిగి బడికి రావడం లేదన్నారు. దీంతో విద్యాపరంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. గిరిజన సంఘాల ప్రతినిధులు వారికి అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం ఆదివాసీ పర్థాన్ సమాజ్ నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తమను పీవీటీజీలుగా గుర్తించాలని, హీరాసుక జయంతికి రూ.50 లక్షలు కేటాయించి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కోసం మూడెకరాల స్థలం కేటాయించడంతోపాటు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ పర్థాన్ తెగలకు ఇళ్లు నిర్మించాలని, జీవో ఎంఎస్ 3ను పునరుద్ధరించాలని కోరారు. పోడు భూములకు పట్టా జారీ చేయాలన్నారు. సమావేశంలో ఆదివాసీ పర్థాన్ సమాజ్ నాయకులు పూసం ఆనంద్‌రావ్, శేషనారాయణ, గేడం మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



గిరిజనుల అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్, అదనపు వైద్యాధికారి కుంర బాలు, ఆర్సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు తదితరులు పాల్గొన్నారు.

- తనకు జిరాక్స్ మిషన్ ఇప్పించాలని ఉట్నూర్‌లోని శాంతినగర్‌కు చెందిన సెడ్మకి రవిబాబు వేడుకున్నాడు.
- ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ గ్రామానికి చెందిన హన్మంతు పాఠశాలలో అడ్మిషన్ కావాలని అర్జీ అందించాడు.
- కిరాణా దుకాణం ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని ఇంద్రవెల్లి మండలం కేస్లాగూడ గ్రామానికి చెందిన జయశ్రీ అర్జీ అందించింది.

ప్రొటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం

- డీఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా
- డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి



డీఈ సురేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీసీసీబీ చైర్మన్

తాంసి: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలపై తనకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారిపై డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం భీంపూర్ మండలంలోని ధనోరలో రూ.20 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. హాజరైన డీసీసీబీ చైర్మన్ తనకు అధికారికంగా సమాచారం ఎందుకు ఇవ్వలేదని డీఈ సురేష్‌పై మండిపడ్డారు. ఈ విషయంపై కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకోని అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు



కదిలి పాపహరేశ్వరాలయంలో హుండీ లెక్కింపులో అధికారులు, భక్తులు



కాల్వ ఆలయంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి అటవీప్రాంతంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వర, కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాల హుండీని సోమవారం లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా గతేడాదితో పోలిస్తే ఈసారి భారీగా ఆదాయం పెరిగిందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ వెల్లడించారు. కదిలి పాపహరేశ్వరాలయంలో భక్తుల కానుకల ద్వారా హుండీలో వచ్చినవి రూ.4,19,924, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా రూ.1,63,540 ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే రూ 40వేల పైచిలుకు ఆదాయం పెరిగింది. కాల్వ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో హుండీ ద్వారా రూ.5,30,510, టికెట్ల ద్వారా రూ.63 వేల ఆదాయం వచ్చింది. 89 గ్రాముల మిశ్రమ బంగారం, 1.420 గ్రాముల వెండి సమకూరింది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం రూ.లక్షా 20వేల ఆదాయం అదనంగా లభించిందని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎండోమెంట్ అధికారులు భూమన్న, జూనియర్ అసిస్టెంట్లు జాదవ్ మాధవరావు పాటిల్, శివకేశవులు, కదిలి ఆలయ చైర్మన్ వెంకట్రావు పాటిల్, కాల్వ ఆలయ చైర్మన్ మహేశ్, ధర్మకర్తలు సింధే దత్తురాం, రమాకాంత్, లింగన్న, శేఖర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర





నిర్మల్: సారంగపూర్ మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో కొలువుదీరిన మల్లన్న జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి సల్లనంబళ్లతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం అక్కడే ఆలయం వద్ద జాగరణ చేపట్టారు. కళాకారుల బృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. గ్రామపెద్దలు దశరథ రాజేశ్వర్, మల్లేశ్, రమేశ్, రవి తదితరులు ఉన్నారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

నిర్మల్‌టౌన్: భార్యను వేధించిన భర్తకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేష్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కు చెందిన రాం రాధ, రాం సురేశ్‌కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. రోజు తాగి వచ్చి భార్యను వేధించసాగాడు. 2008లో అప్పటి ప్రభుత్వం మహాలక్ష్మివాడలో భార్య రాధకు ఇందిరమ్మ పథకం కింద ప్లాట్ ఇచ్చింది. ఈ ప్లాట్ విక్రయించగా వచ్చిన డబ్బులు ఇవ్వాలని ఆమెను హింసించేవాడు. చెల్లె బాధ చూడలేక అక్కగోజ్జ సునీత తన ఇంటి పక్కనే ఆమెను కిరాయిగదిలో ఉంచింది. 2022 ఫిబ్రవరి 8న భర్త అక్కడికి వచ్చి డబ్బులివ్వాలని భార్యతో గొడవపడి తీవ్రంగా గాయపర్చాడు. అరుపులకు సునీత రాగానే సురేశ్ పారిపోయాడు. భార్య ఫిర్యాదుతో అప్పటి ఎస్సై అరఫత్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి సురేశ్‌ను హాజరుపర్చారు. ఏపీపీ వై.రమణారావు 14 మందిని విచారించి నేరం రుజువు చేయడంతో ఈమేరకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు.

గుడిసె..సేద తీరేలా



ముధోల్: భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. పగలు ఎండ తీవ్రతకు ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు ఉపశమనం కోసం అనేక పాట్లు పడుతున్నారు. ముధోల్ మండలం విఠోలి గ్రామంలో రైతు దిగంబర్ తన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం తాత్కాలిక గుడిసె ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో భోజనం చేయడం, వ్యవసాయ పని తర్వాత ఇలా సేదతీరుతున్నాడు.



నాడు జలకళ..నేడు వెలవెల



కుంటాల జలపాతం ప్రస్తుతం జలధారలు లేక వెలవెలబోతోంది. ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం అందాలను వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాతోపాటు ఆయా రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం జలపాతం జలధారలు లేక బోసిపోతోంది. దీంతో పర్యాటకుల తాకిడి తగ్గింది. - నేరడిగొండ



గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తీసుకువస్తున్న గజఈతగాళ్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి పెద్దవాగులో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన హోటల్ యజమాని సెల్వరాజ్ కుమారుడు విఘ్నేష్ అలియాస్ విక్కీ (21) ఇంటర్ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటూ ఏఐఈఈఈ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మాద్వాయిగూడ సమీపంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వద్ద పెద్దవాగులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అందరూ కలిసి ఈతకొడుతుండగా విఘ్నేష్ ఒక్కసారి లోతుగా ఉన్న నీటిలోకి వెళ్లడంతో మునిగిపోయాడు. తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పోలీసులు స్థానిక జాలర్లసాయంతో రాత్రివరకు గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం గజ ఈతగాళ్లను పిలిపించి వాగులో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఒక్కగానొక్క కొడుకు కళ్ల ముందే విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

వాంకిడి(ఆసిఫాబాద్): మెట్లపై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం ఇంద్రానగర్ కాలనీకి చెందిన పెందూర్ శేఖర్ (32) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి పక్కనే ఉన్న బాత్‌రూం వెళ్లాడు. అనంతరం ఇంట్లోకి వచ్చే క్రమంలో మెట్లవద్ద తడబడి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతని భార్య పెందూర్ విద్య గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి 7 నెలల బాబు ఉన్నాడు. మృతుని తండ్రి సుధాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రా‘ఫికర్’



ఇచ్చోడ: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యతో జనం పరేషాన్ అవుతున్నారు. శివాజీచౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్, తాత్కాలిక బస్టాండ్ వరకు గంటల కొద్ది వాహనాలు నిలిచిపోతున్నాయి. మండలకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా బస్సులు, బజార్‌హత్నూర్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఇష్టారీతిన నిలుపుతున్నారు. షాపుల యజమానులు తమ సామగ్రిని రోడ్డు వరకు పెట్టడం, ఆటోలు, బైక్‌లు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు, మహిళలు, విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే అంగడిబజార్ రోడ్డులో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.